క్లుప్తంగా

స్మార్ట్ టీవీలకు కొత్త సిమ్‌లు



పోతినీడుపాలెం స్కూల్‌లో స్మార్ట్ టీవీకి సిమ్ అమర్చుతున్న సీఆర్పీ

నల్లజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న స్మార్ట్ టీవీలకు సిమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. ఇంతవరకు వాటిలో ఉన్న సిమ్‌లను తొలగించి కొత్తగా జియో అన్‌లిమిటెడ్ సిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పోతవరం క్లస్టర్‌లో 9 పాఠశాలలకు, నల్లజర్ల క్లస్టర్ 11, దూబచర్ల క్లస్టర్ 10, అనంతపల్లి క్లస్టర్ 10 పాఠశాలల్లో సీఆర్పీలు ఈ సిమ్‌లు అమర్చుతున్నట్టు తెలిపారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.1.53 లక్షలు



గోపవరంలో ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో వేంచేసియున్న గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ హుండీని గురువారం లెక్కించినట్లు ఆలయ మేనేజర్ నామా సూర్య ప్రకాష్ తెలిపారు. వాడపల్లి, తాళ్లపూడి దేవాలయాల ఈఓలు కె.బాలకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో గుబ్బాలమ్మ ఆలయ హుండీని లెక్కించగా, 92 రోజులకు రూ.1,53,527 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొడ్ల మణికంఠ, వెలగన సూర్యచంద్రరావు, ఎస్.శ్రీనివాస్, బండ సతీష్, యర్రంశెట్టి వెంకట్రావు, నాగు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



ఆస్పత్రిలో రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న రొటేరియన్లు

నిడదవోలు: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 61 మంది రోగులు, వారి సహాయకులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, క్లబ్ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, చిక్కాల రాజా, ఎండీ ఫయాజ్, పొన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన



విద్యార్థుల సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్

నల్లజర్ల: సమాజంలో రోజురోజుకు తగ్గిపోతున్న బాలికల శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని తీసుకువచ్చినట్టు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనోజ్ అన్నారు. గురువారం దూబచర్లలోని డైట్(ఉపాధ్యాయ శిక్షణ సంస్థ)లో ఛాత్రోపాధ్యాయులకు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భస్థ శిశువుకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. సమాజంలో ఆడ,మగ పిల్లల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, ఇది సమాజానికి అరిష్టమన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ యం.కమలకుమారి, సీహెచ్ఓ యస్.వెంకటశాస్త్రి, యంయల్‌హెచ్‌పీ షేక్ జరీనా, ఎంపీహెచ్ ఎస్ ఏ.సత్యనారాయణ, కె.హెప్సిబా, టి.వి.రాఘవేంద్రరావు, విలేజ్ హెల్త్ సెక్రటరీలు కె.హేమలత, కె.ఇందిరా ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బాయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా రతీదేవి

నిడదవోలు: కొత్తగా నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా సీనియర్ కౌన్సిలర్ పువ్వుల రతీదేవి ఎంపికయ్యారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.కృష్ణవేణి అధ్యక్షతన గురువారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రతీదేవి మాట్లాడుతూ, నిడదవోలులో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, సింగవరం సొసైటీ ప్రెసిడెంట్ పెన్మత్స చందు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై ఈ-గల్ ఐ

- ఉపాధి హామీ పథకంలో ఈ-కేవైసీతో అక్రమాలకు చెక్
- యాప్‌లో కూలీల ఆధార్, జాబ్ కార్డుల వివరాల నమోదు
- రిజిస్టర్ కాకపోతే కోల్పోనున్న ఉపాధి
- ప్రక్రియలో జిల్లాలో నిడదవోలు మండలం ఫస్ట్
- నియోజకవర్గంలో 33,301 మంది కూలీలు



మునిపల్లిలో ఉపాధి కూలీలకు ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది



డి.ముప్పవరంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

నిడదవోలు రూరల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధి కూలీల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. కూలీల ఆధార్, జాబ్ కార్డులను ఈ-కేవైసీ చేసుకుంటేనే ఉపాధి పనులు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు ఎన్ఆర్ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎస్ఎస్) అందుబాటులోకి తెచ్చింది. ఉపాధి కూలీ ఆధార్, ఉపాధి కార్డు వివరాలను నమోదు చేసి, కూలీ ముఖ గుర్తింపు ఫొటో తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ-కేవైసీ నమోదు చేస్తారు. ఇందుకు కూలీలు తమ ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకుని ఉండాలి. ఈ-కేవైసీ పూర్తి చేయని కూలీలు ఇక నుంచి ఉపాధి పనుల్లో అవకాశం కోల్పోతారు.

చురుగ్గా ప్రక్రియ

ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల ఈ-కేవైసీ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నిడదవోలు మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 14,074 జాబ్ కార్డులుండగా, వీటి పరిధిలో 33,301 మంది యాక్టివ్ ఉపాధి కూలీలు ఉన్నారు. ఇప్పటివరకు 16,127 మంది కూలీలకు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేశారు.

అవకతవకలను నిరోధించేందుకు..

కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొందరు క్షేత్ర సహాయకులు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ నిధులు స్వాహా చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు, ఒకరి పేరున మరొకరు వెళ్తున్నట్లుగా నమోదు చేస్తున్నట్లు తేలింది. మరోవైపు సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయటపడటం, రికవరీలు జరుగుతున్నా ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. ఈ క్రమంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర చిత్రాలతో పాటు.. పని చేయకపోయినా చేసినట్లు అనేక చోట్ల అప్‌లోడ్ చేస్తున్నట్లుగా తేలింది. దీంతో కూలీలకు కూలీ గిట్టుబాటు కాక, ఆశించిన స్థాయిలో వేతనాలు రావడం లేదు, గతంలో జాబ్ కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానం చేసినా, కొన్నిచోట్ల హాజరు నమోదులో తప్పిదాలు చేస్తున్నట్లు తేలింది. వీటన్నింటికీ చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసింది.

నియోజకవర్గంలో ఉపాధి హామీ కూలీల వివరాలు..

మండలం	యాక్టివ్ కూలీలు	ఈ-కేవైసీ అయిన కూలీలు
నిడదవోలు	13,623	7,927
పెరవలి	10,341	4,709
ఉండ్రాజవరం	9,337	3,491

హాజరు నమోదు ఇలా..

యాక్టివ్ కూలీల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసి, పనికి వచ్చాక, పని పూర్తయ్యాక రెండుసార్లు ముఖ గుర్తింపు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఫొటోలు కచ్చితంగా పని ప్రదేశంలోనే తీయాలి. కూలీల వివరాలు యాప్‌లో నమోదు కాకపోతే ఉపాధి పనికి వెళ్లినా హాజరు పడదు. దీంతో కూలీ డబ్బులు వారి ఖాతాల్లో జమ కావు. వేరే ప్రాంతంలో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే జీపీఎస్ సిస్టం ద్వారా అది తప్పుడు హాజరు అని గుర్తిస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఉపాధి హామీ పథకంలో అవకతవకలను నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

వీలైనంత త్వరగా పూర్తి



నియోజకవర్గంలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ చేపట్టాం. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ ముమ్మరంగా కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య వల్ల నెమ్మదిగా జరుగుతోంది. నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోనే నిడదవోలు మండలం మొదటి స్థానంలో ఉంది. వీలైనంత త్వరగా ఈ-కేవైసీని పూర్తి చేస్తాం. - ఏపీవీ సత్యనారాయణ, ఏపీఓ, నిడదవోలు

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

- కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు, మాజీ ఎమ్మెల్యే తలారి
- రామచంద్రపురంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ



రచ్చబండ సభకు హాజరైన ప్రజలు



రచ్చబండ సభలో మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణు, తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తీవ్రంగా విమర్శించారు. మండలంలో కలవలపల్లి శివారు రామచంద్రపురంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. కార్యక్రమానికి వేణుగోపాలకృష్ణ, పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, కూటమి నేతల మోసాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉచిత ఇసుక ఎక్కడ లభిస్తోందని ప్రశ్నించారు. గూగుల్ సంస్థకు రూ.20 వేల కోట్లకు పైగా రాయితీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు కేవలం రూ.5 వేల కోట్లు కేటాయించలేక.. ప్రైవేటుపరం చేస్తున్నారని దుయ్యబట్టారు. దీనివల్ల పేదలకు వైద్య విద్య దూరమవుతుందని, భవిష్యత్లో ప్రజారోగ్యానికి భరోసా ఉండదన్నారు. వైద్యపరంగా పేదలను ఆదుకునేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేశారని గుర్తు చేశారు. కానీ చంద్రబాబు సకాలంలో బిల్లులు చెల్లించకుండా, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారన్నారు.

క్యూ ఆర్ కోడ్ లేకుండా విక్రయాలా!

రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుందని, కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటుందని వేణు విమర్శించారు. రూ.99 క్వార్టర్ మద్యాన్ని రూ.130కు విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్నారన్నారు. మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ లేకుండానే విక్రయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 70 వేలకు పైగా బెల్టుషాపులు ఉన్నాయన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం దందా నిర్వహిస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య విద్య, వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కళాశాలలను తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు వాటిని దూరం చేసేందుకు పీపీపీ విధానాన్ని తెచ్చిందన్నారు. దీనిని ప్రజలంతా తిప్పి కొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ, కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు వారడం ఖాయమన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెల్లుబికుతున్న ప్రజాగ్రహ జ్వాలల్లో కూటమి అక్రమాలు దగ్ధమవడం తథ్యమన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం కుటీర పరిశ్రమలా ఏరులై పారిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను వంచించిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజ లందరికీ వివరిస్తామన్నారు. గిరజాల వీర్రాజు మాట్లాడుతూ, కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు పరిమి సోమరాజు, యార్లగడ్డ జోషి, సుంకర సత్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కంఠమని రమేష్‌బాబు, మండల అధ్యక్షులు మట్టా వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, నాయకులు ఇంటి వీర్రాజు, ఉప్పులూరి సూరిబాబు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్ముడు, కొయ్యే మణి, కుదప రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కోటి సంతకాలు సేకరిస్తున్న పార్టీ నేతలు

అంబేడ్కర్ ఆశయాలను కాలరాస్తున్న 'కూటమి'



చాగల్లులో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలను సత్కరిస్తున్న సురేంద్రకుమార్

చాగల్లు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ప్రభుత్వాలే విద్య, వైద్యం అందించాలని ఆయన ఆకాంక్షిస్తే, ప్రస్తుత కూటమి సర్కార్ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటం తగదన్నారు. చాగల్లులో ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ సోదరుడు గంధ్రోతు సురేంద్రకుమార్ నివాసంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు విచ్చేసారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించి, అందులో 7 కాలేజీలను పూర్తి చేయగా, 5 కాలేజీల్లో తరగతులు జరుగుతున్నాయని వివరించారు. 17 నెలల కాలంలో రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిన కూటమి ప్రభుత్వం.. మెడికల్ కాలేజీల నిర్మాణానికి డబ్బుల్లేవని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు పేదలకు అందేంత వరకూ ఉద్యమాలు చేస్తూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలను మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్ దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల అధ్యక్షులు మట్టా వెంకట్రావు, సుంకర సత్యనారాయణ, చిట్టూరి అన్నవరం, బొర్రా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అండతోనే కూటమి పాలన



ఆవపాడులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లజర్ల: పాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం రాత్రి ఆవపాడులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత వెంకటస్వామి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ, రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా హాజరై సంతకాలు చేశారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు రచ్చబండలో తమ అభిప్రాయాలు వెల్లడించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు లేదని, కేవలం పోలీసుల్ని అడ్డుపెట్టుకొని పరిపాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, పాస్టర్స్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు పిట్టా జాన్‌సుకుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కేసుల్లో ఇరుక్కుంటే జీవితం నాశనం

విద్యార్థులకు ఎస్సై కౌన్సెలింగ్

తాళ్లపూడి: విద్యార్థులు కేవలం చదువుపైనే తమ దృష్టి పెట్టాలని, వివాదాల జోలికి వెళ్లకుండా, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ హితవు పలికారు. వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులతో వేర్వేరుగా కౌన్సెలింగ్ ఇచ్చారు. బుధవారం సాయంత్రం గ్రామంలో విద్యార్థులు గొడవ పడి తోపులాటకు దిగిన నేపథ్యంలో ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, విద్యార్థులు తెలిసీతెలియక తప్పులు చేసి ఒక్కసారి పోలీస్ రికార్డుల్లోకి ఎక్కితే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కేసుల వల్ల ఉద్యోగాలూ పొందలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గొడవలు, అల్లర్లకు వెళితే భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. మైనర్లు లైసెన్స్ లేకుండా మోటార్ వాహనాలు నడపరాదన్నారు. కాలేజీకి పంపుతున్న తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని, హద్దులు దాటితే ప్రమాదాల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. అదేవిధంగా టాబ్‌లను చదువులకు మాత్రమే వినియోగించాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలమణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ట్రైనీ ఎస్సై ఆదిత్య శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గోదావరి హారతి ఏర్పాట్లు

పోస్టర్ ఆవిష్కరించిన ఆర్డీవో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రతిష్టాత్మకంగా ఈ నెల 27న నిర్వహిస్తున్న గోదావరి హారతి కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గురువారం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గోదావరి హారతి పోస్టర్‌ను ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరిగే గోదావరి హారతి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వీక్షకుల సౌకర్యార్థం సిట్టింగ్ ఏర్పాట్లు పెంచుతున్నామన్నారు. గోదావరిలో మూడు పంట్లు ఏర్పాటు చేసి, విశాల వేదికను తీర్చిదిద్దినట్లు వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఉత్సవమూర్తులను తెచ్చి, వారి సంప్రదాయం ప్రకారం గోదావరి తీరంలో హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. లోకకల్యాణం కోసం ఈ కార్యక్రమం ఆధ్యాత్మికంగా, ఘనంగా నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురపునేని చిన్న, పిల్లలమర్రి మురళీకృష్ణ, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్లు ఏవీ శివరామకృష్ణ, కలగర శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల సిబ్బంది

దేవరపల్లి: శ్రీకాకుళం జిల్లాలో నవంబర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ అండర్-19 పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టులో దేవరపల్లి మండలం యాదవోలు జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 14న ఏలూరులో జరిగిన జిల్లా జట్ల ఎంపికలో విద్యార్థినులు ప్రతిభ చూపడంతో జిల్లా జట్టులో స్థానం దక్కిందని పీఈటీ తంగెళ్ల మునేశ్వరరావు గురువారం తెలిపారు. జట్టులో మొత్తం 15 మంది క్రీడాకారిణులు ఉండగా, 10 మంది యాదవోలు హైస్కూలుకు చెందిన విద్యార్థినులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

ఆపదలో ప్రాణాలు నిలిపే సీపీఆర్



అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోపాలపురం: గుండె సంబంధిత వ్యాధులపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలని అన్నదేవరపేట సీహెచ్‌సీ డాక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం సీపీఆర్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని రక్షించడానికి గుండె, ఊపిరితిత్తుల పనితీరుపై సీపీఆర్ ప్రాముఖ్యతను వీడియో రూపంలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సుజిని, హెచ్ఎస్ ఎం.సుభాషిణి, ఎ.త్రిమూర్తులు, బీహెచ్ సువర్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల: ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నల్లజర్ల ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రకాశరావుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

అదేవిధంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు, చెట్టుకొమ్మల తొలగింపు కార్యక్రమం చేపడుతున్న దృష్ట్యా శనివారం 18వ తేది నల్లజర్ల టౌన్ ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు గురువారం తెలిపారు.

వినియోగదారులకు ఎక్సైజ్ సురక్ష యాప్

నిడదవోలు: రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న నకిలీ మద్యం ఉదంతాలను అరికట్టేందుకు మద్యం వినియోగదారులకు ఎక్సైజ్ సురక్ష యాప్ అందుబాటులోకి వచ్చిందని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా వచ్చిన యాప్ ద్వారా కొనుగోలు చేసిన మద్యం అసలైందో, కాదో కొనుగోలుదారులు తెలుసుకోవచ్చని చెప్పారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని, దాని ద్వారా మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలన్నారు. తద్వారా మద్యం ఎక్కడ తయారైంది, తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, ఏ డిపో నుంచి, ఏ మద్యం దుకాణానికి సరఫరా అయిందో తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఒకవేళ నకిలీ మద్యమైతే డిటైల్స్ నాట్ ఫౌండ్ అని వస్తుందని చెప్పారు. ఈ యాప్ ద్వారా మద్యం వినియోగదారులు తాము కొనుగోలు చేసిన మద్యం నాణ్యమైనదో, కాదో స్వయంగా పరీక్షించి తెలుసుకోవచ్చని తెలిపారు.